సమాచారం

పోస్టర్ ఆవిష్కరణ



బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు తదితరులు

కాచిగూడ: కేంద్ర పర్యాటక, సాంస్కృతిక ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 21,22,23 తేదీల్లో 'ఖేల్ తెలంగాణ జీతో తెలంగాణ' పేరుతో క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు ప్రకటించారు. గురువారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో క్రీడోత్సవాల వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడల్లో భాగంగా కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ (రన్నింగ్) తదితర క్రీడలను నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని యువతీ, యువకులు క్రీడాకారులు అందరూ పాల్గొని క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని గౌతంరావు కోరారు. సూర్యప్రకాష్ సింగ్, చిట్టి శ్రీధర్, జ్యోతిరెడ్డి, క్రిష్ణగౌడ్, సందీప్, మనోహర్, రమేష్, సందీప్‌యాదవ్, సత్యనారాయణ, సుభాషిణి, రాఘవరెడ్డి, వెంకటస్వామి, శ్యామ్‌రాజ్, గంగరాజు, సుప్రియా, మున్నా తదితరులున్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కాచిగూడ: హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రొఫెసర్ వినయ్‌బాబుకు మద్దతుగా గురువారం కాచిగూడ, ఇసామియా బజార్, చాదర్‌ఘాట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో టీపీటీఎఫ్ ప్రతినిధులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) హైదరాబాద్ ప్రధానకార్యదర్శి రాంబాబు, ఉపాధ్యక్షుడు కేఎస్ఆర్ శాస్త్రి మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రొఫెసర్ ఎ.వినయ్‌బాబును గెలిపించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. రాంబాబు, కె.శ్రీనివాస్ రెడ్డి, వీరకుమార్, వాణిశ్రీ, శుభాంగి, అనురాధ, కల్యాణి, మేరీ, పుష్ప, రాణి, చిన్న, ఉపాధ్యాయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



ముషీరాబాద్: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా 'ఆస్తా భారత్ సేవా ట్రస్ట్' ఆధ్వర్యంలో ముషీరాబాద్ నుంచి రాంనగర్ చౌరస్తా వరకు తిరంగ యాత్ర నిర్వహించి రాంనగర్ చౌరస్తాలో డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ అరుణ్‌కుమార్‌ను ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు రమేష్‌కుమార్‌మాదిగ ఘనంగా సత్కరించారు. ఇప్పటి వరకు ఎవరు చేయనటువంటి కార్యక్రమాన్ని ఆయన చేశారని కొనియాడారు. నేరళ్ల కుషాల్ కుమార్, అనిల్‌కుమార్, శ్రీనివాస్, కిరణ్‌యాదవ్ తదితరులున్నారు.

వినతిపత్రం అందజేత

ముషీరాబాద్: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖలో జిల్లా, డివిజన్ స్థాయి కార్యాలయాల్లో పనిచేసే జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, హాస్టల్ వార్డెన్ డిప్యూటేషన్‌లను రద్దుచేసి వారిని అదే స్థానాలకు పంపాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శికి ఆయన వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్, ట్యూషన్ ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఇంజినీరింగ్‌తో పాటు వివిధ వృత్తివిద్య కళాశాలల్లో చదువుతున్న బీసీ విద్యార్థుల పూర్తి ఫీజులను ప్రభుత్వమే భరించాలని కోరారు. రూ.35 వేలు మాత్రమే ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వడం వల్ల విద్యార్థులకు ఫీజుల భారం పెరుగుతుందన్నారు. సకాలంలో ట్యూషన్ ఫీజుల నిధులు కళాశాలలకు ఇవ్వకపోవడం వల్ల కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లు పాసైన ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బాలకార్మికులకు విముక్తి

సికింద్రాబాద్: బలార్షా నుంచి సికింద్రాబాద్‌కు అక్రమంగా తరలించిన 26 మంది బాల కార్మికులను రైల్వే రక్షణ దళం పోలీసులు రక్షించారు. ఆర్‌పీఎఫ్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ దెబస్మిత బెనర్జీ కథనం ప్రకారం.. నగరంలోని వివిధ కార్మాగారాల్లో పనిచేసేందుకు బలాషా నుంచి ఆరుగురు వ్యక్తులు బాలలను కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో తీసుకుని వస్తున్నట్టు సమాచారం తెలుసుకుని ఆర్‌పీఎఫ్ పోలీసులు అప్రమత్తమయ్యారు.అన్ని స్టేషన్లలో పరిశీలన అనంతరం బాలలను సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో దింపారు. రక్షించిన బాలలను బీబీఏ ప్రతినిధులకు అప్పగించి రవాణాదారులపై కేసు నమోదు చేశామన్నారు.

'ఉపాధిహామీ ఎత్తివేతకు కేంద్రం కుట్ర'

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ఆరోపణ



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉపాధి హామీ ఎత్తివేతకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని అలాంటి కుట్రలను ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళీ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్, తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ హక్కుల పరిరక్షణ సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. అమృత్‌కాల్, సప్తరుషి, వందేళ్ల భారత్ బడ్జెట్‌గా చెబుతూ ఉపాధిహామీ కూలీల ఆత్మగౌరవం, ఆదాయం, ఆహార భద్రతతో జీవించడాన్ని జీర్ణించుకోలేక ఉపాధిహామీ చట్టంపై కేంద్రం ముప్పేట దాడి చేస్తోందన్నారు. - బడ్జెట్‌లో కూలీలకు అన్యాయం చేశారని రూ. 3 లక్షల కోట్లు అవసరమైతే కేవం రూ.35వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు.

- ఉపాధి పథకం అమలుపై ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కనీసం వంద రోజులు కూడా పని కల్పించకుండా పేదలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి గోపాల్‌రావు, బీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొని మాట్లాడారు. ఉపాధి హామీ హక్కుల పరిరక్షణ కోసం ఢిల్లీలో ఫిబ్రవరి 6 నుంచి 15 వరకు జరిగే దీక్షలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. వివిధ సంఘాల నాయకులు వెంకటయ్య, మీరా, సంగమిత్ర, వెంకటరాములు, జనార్దన్, కల్పన, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత కమిటీ సిఫార్సును అమలు చేయాలి

టాలీవుడ్‌లో లైంగిక వేధింపులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ముషీరాబాద్: తెలుగు సినీ పరిశ్రమలో జరుగుతున్న లైంగిక వేధింపులపై తెలంగాణ ప్రభుత్వం 2019లో వేసిన ఉన్నత కమిటీ నాలుగు నెలల క్రితం ప్రభుత్వానికి అందించిన నివేదిక, సిఫార్సులను తక్షణం అమలు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నగర కార్యదర్శి శ్రీనివాస్, నగర నాయకురాలు వరలక్ష్మి, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రావు, మహేందర్‌లు మాట్లాడారు. టాలీవుడ్‌లో మహిళా ఆర్టిస్టులపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయని నిర్ధారిస్తూ.. కమిటీ రిపోర్టు అందజేసిందని ఆ వేధింపులను అరికట్టేందుకు పలు సిఫార్సులు ప్రభుత్వానికి అందజేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.

- ఒంటరి మహిళా ఆర్టిస్టులు దళారుల చేతుల్లో తీవ్రమైన లైంగిక దోపిడీకి గురవుతున్నారని సినీ పరిశ్రమలో దళారుల దాష్టికాలు ఎక్కువగా ఉన్నాయన్నారు.
- లైంగిక వేధింపులపై అంతర్గత కమిటీ వేయాలని సినీ పరిశ్రమ పెద్దలు 2018లోనే నిర్ణయించుకున్నా.. నేటికి అది అమలు కాలేదని వెంటనే మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసి లైంగిక వేధింపులకు అరికట్టాలని డిమాండ్ చేశారు.

పుస్తకావిష్కరణ



చిక్కడపల్లి: రచయిత్రి డాక్టర్ సన్నపురాజు విజయశ్రీ రచించిన 'తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ వేసిన దారులు' పుస్తకావిష్కరణ చిక్కడపల్లి నగర గ్రంథాలయంలో నిర్వహించారు. గురువారం రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ శ్రీధర్, నగర గ్రంథాలయం చైర్‌పర్సన్ ప్రసన్నరామ్మూర్తి, టీఎన్‌జీఓఎస్ యూనియన్ మాజీ అధ్యక్షుడు దేవి ప్రసాద్‌రావు, టీఎన్‌జీఓ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు రాజేందర్, టీఎన్‌జీఓ నగర అధ్యక్షుడు ముజీబ్ తదితరులు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. గ్రంథాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అయోధ్య, నగర కార్యదర్శి మహేందర్, ఉపాధ్యక్షుడు వెంకటేష్, కృష్ణారెడ్డి తదితరులున్నారు.

గోపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



నివాళి అర్పిస్తున్న చిట్టి శ్రీధర్ తదితరులు

కాచిగూడ: బర్కత్‌పురా హౌజింగ్ బోర్డు కాలనీ అభివృద్ధికి గోపాల్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి చిట్టి శ్రీధర్ అన్నారు. చిలుకమర్రి గోపాల్‌రెడ్డి సంతాప సభ బర్కత్‌పురా హౌజింగ్ బోర్డు కాలనీ పార్కులో నిర్వహించారు. ఆయన పార్కు వాకర్స్ అసోసియేషన్‌లో కోశాధికారిగా ఉంటూ.. పార్కులో అభివృద్ధి పనులు, పండుగల సమయంలో వేడుకలను ఘనంగా నిర్వహించేలా కృషి చేశారన్నారు. జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ రాంబాబు, శేషునారాయణ, రాజశేఖర్‌రెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుకే దళితబంధు దరఖాస్తు



తహసీల్దార్ అయ్యప్పకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

ముషీరాబాద్: దళిత బంధు పథకానికి దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు నేరుగా తహసీల్దారే దరఖాస్తులను ఇవ్వాలని బీజేపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు తలకోట అరుణ్‌కుమార్ అన్నారు. గురువారం ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం తహసీల్దార్ అయ్యప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న ఆసరా ఫించన్‌లు, కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ డబ్బులను ప్రభుత్వ అధికారులే నేరుగా అందించాలన్నారు. ఫించన్ కార్డులు మంజూరైనప్పటికీ తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఎమ్మెల్యేకు అందజేయడంతో వారు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలచే ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తున్నారన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు రాజు, భరత్‌గౌడ్, శ్రీనివాస్, మద్దూరి శివాజీ, పార్థసారధి, జైపాల్‌రెడ్డి, మంగళ, రామారావు, రవి, జ్యోతి, బాలకృష్ణ, బీ.ఎస్.చారి, బుర్ర రాజు, రాజశేఖర్‌యాదవ్, కేశవ్, కిరణ్ యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ చీఫ్ సెక్రెటరీని కలిసిన రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు



నల్లకుంట: రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా మీడియా ఇన్‌చార్జ్ ఎం. బజాక్‌రాజ్ ఆధ్వర్యంలో సొసైటీ ప్రతినిధి బృందం గురువారం సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్ చీఫ్ సెక్రెటరీ సురేంద్ర మోహన్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రధాని టీబీ ముక్త్ అభియాన్ పథకంలో భాగంగా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని మురికివాడల్లో క్షయ వ్యాధిపై చేపడుతున్న అవగాహన, ఇతర సేవా కార్యక్రమాలను చీఫ్ సెక్రెటరీకి వివరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా చైర్మన్ భీమిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

రేపు నెక్లెస్ రోడ్డులో 5కే రన్



మాట్లాడుతున్న మహాశృంగదాస తదితరులు

సుల్తాన్‌బజార్: కేన్సర్ మహమ్మారిపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈనెల 4న నెక్లెస్ రోడ్డులో 5కే రన్ నిర్వహిస్తున్నట్లు కూకట్‌పల్లి ఇస్కాన్ సంస్థ అధ్యక్షుడు మహాశృంగదాస అన్నారు. గురువారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేన్సర్ వాధిని ఆరంభంలోనే గుర్తిస్తే చికిత్స అందించడం సులభతరం అవుతుందని, తద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. మారుతున్న జీవన విధానం, ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పుల వల్ల అనేక రోగాలు సంక్రమిస్తున్నాయని, వాటిలో కేన్సర్ ఒకటని సరైన అవగాహన లేకపోవడంతో కేన్సర్ రోగుల మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ల్యాండ్ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, రచయిత డాక్టర్ సహదేవ్‌దాస హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు రోమా, సుహాసిని, ఉత్తమ్ ప్రభు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. అంబికానగర్‌కు చెందిన తాపీమేస్త్రీ సత్యనారాయణ (48)కి భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఉప్పుగూడ రైల్వేస్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ చోరీలో రిమాండ్..

కాచిగూడ: దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా రవీంద్రనాయక్ కాలనీకి చెందిన కితావత్ దేవీజీ (42) కాచిగూడ రైల్వే స్టేషన్‌లో క్లీనర్‌గా పనిచేస్తూ.. దొంగతనాలకు పాల్పడుతుండేవాడు. రంగంలోకి దిగిన పోలీసులు విచారించి దొంగిలించిన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఆసరా పింఛన్లు విడుదల చేయాలి



మాట్లాడుతున్న కొల్లి నాగేశ్వర్‌రావు

అడ్డగుట్ట: ఆసరా పింఛన్లు వెంటనే విడుదల చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అఖిల భారత వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మూడు నెలలుగా పింఛన్లు రాకపోవడంతో ఎంతో మంది వికలాంగులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలో సుమారుగా 15 లక్షల మంది పింఛన్లపై ఆధారపడి బతుకుతున్నారని వారికి అండగా నిలబడాల్సిన ప్రభుత్వం ఇంత వరకు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, రాజయ్య, పులిపాటి శ్రీనివాస్, ఆంజనేయులు, సైదులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



సతీష్ (ఫైల్)

నల్లకుంట: ఇంట్లో చెప్పకుండా ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా చోటుచేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్రె సతీష్ (38) భార్య సరస్వతి దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి నల్లకుంట శంకరమఠం ప్రాంతంలో నివసిస్తున్నారు. గత నెల (జనవరి) 20న భార్య తన భర్త స్వగ్రామం కొహూర్‌కు వెళ్లగా.. మరుసటి రోజు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో భర్త కూడా గ్రామానికి వచ్చాడు. ఒక గంట తర్వాత హైదరాబాద్‌కు వెళ్తున్నానని భార్యకు చెప్పి వెళ్లిపోయాడు. జనవరి 22న గ్రామం నుంచి హైదరాబాద్‌లోని తన నివాసానికి వచ్చిన ఆమెకు ఇంట్లో భర్త కనిపించలేదు. సరూర్‌నగర్‌లో ఉండే ఆడపడుచు ఇంట్లో పూజకు వెళ్లినట్లు తెలిసింది. బంధువుల వద్ద కూడా ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో ఈ నెల 1న భార్య నల్లకుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

- కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. గురువారం డివిజన్‌లో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈస్ట్‌ప్రశాంత్‌నగర్, మూసారంబాగ్‌లలో పేరుకుపోయిన చెత్తకుప్పలు, వ్యర్థాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... పరిశుభ్రత పట్ల శ్రద్ధ తీసుకోవాలని కాలనీవాసులకు సూచించారు. చెత్తను రోడ్లు, ఫుట్‌పాత్‌లపై వేయరాదని, చెత్తను సేకరించే ఆటోలలోనే వేయాలన్నారు. చెత్త పేరుకు పోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం పనికి రాదని స్పష్టం చేశారు. శానిటేషన్ జవాన్ రమేష్, ఎస్ఎఫ్ఏలు గణేష్, శ్రీను, నాయకులు రవీందర్‌రెడ్డి, ఉదయ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో సౌకర్యాల కల్పనకు కృషి

అంబర్‌పేట: నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి తనవంతు తోడ్పాటును అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం గోల్నాక డివిజన్‌లోని హనుమాన్ ఆలయంలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన బోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తులకు కావాల్సిన వసతులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దేవాదాయశాఖ పరిధిలో లేని ఆలయాల్లో అర్చన చేస్తున్న పేద బ్రాహ్మణులకు ప్రతినెల సొంతంగా ఆదుకుంటున్నట్టు ఆయన వెల్లడించారు. స్థానిక ఆలయ ప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం కోసం పోరాడిన ఉద్యమకారులకు ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ సీఎం కేసీఆర్‌కు మెయిల్ ద్వారా వినతిపత్రం పంపించారు. అనంతరం గురువారం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యార్థులు, యువత, ఉద్యోగులు తమ పనులను వదులుకుని రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఉద్యమించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉద్యమకారులకు అనేక ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో పాటు పిల్లలను సక్రమంగా చదివించుకునే పరిస్థితి లేదన్నారు.

- జార్ఖండ్ రాష్ట్ర ఆవిర్భావ సమయంలో అక్కడి సీఎం ప్రత్యేక జీవో ద్వారా ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేసినట్లుగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ బోర్డుకు బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలలో ఉద్యమకారులకు 20 శాతం కేటాయించాలని, స్వాతంత్ర్య సమరయోధులుగా వారిని గుర్తించి గౌరవించాలన్నారు. వీరికి ప్రతి నెలా రూ.25 వేల పింఛన్, రూ.50 లక్షల వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉచితబస్సు, ట్రైన్ సౌకర్యాలతో పాటు ప్రభుత్వం హెల్త్ కార్డులను ఇవ్వాలని కోరారు.



జీహెచ్ఎంసీ కార్మికురాలికి రిక్షాను పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

స్వచ్ఛ రిక్షా పంపిణీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జీహెచ్ఎంసీ కార్మికురాలు సరోజకు నాయిని నర్సింహారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్, వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి గురువారం స్వచ్ఛ రిక్షాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివంగత మాజీ హోం మంత్రి నాయిని మనవళ్లు అంకుష్‌రెడ్డి, ధనుష్‌రెడ్డిలు వారి పాకెట్ మనీ ద్వారా సమకూర్చిన డబ్బుతో ఈ రిక్షాను కొనుగోలు చేసి పేద కార్మికురాలైన సరోజకు అందజేసినట్లు తెలిపారు. సామాజిక స్పృహతో ఇలాంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన వారిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. బీఆర్ఎస్ నాయకులు కిరణ్ కుమార్, శ్యామ్, కార్తిక్‌యాదవ్, సత్యనారాయణ, సిద్దిఖీ, అరుణ్, వెంకటేష్, సాలమ్మ, కల్పన, సబిత తదితరులున్నారు.

మానవహక్కుల పరిరక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట: నల్లకుంట సిండికేట్ బ్యాంక్ చౌరస్తా సమీపంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్ అండ్ సోషల్ జస్టిస్ ఆర్గనైజేషన్ (ఐహెచ్ఆర్ఎస్‌జేఓ) రాష్ట్ర కార్యాలయం ప్రారంభమైంది. గురువారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్లకుంట కార్పొరేటర్ అమృత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ హక్కుల పరిరక్షణకు ఐహెచ్ఆర్ఎస్‌జేఓ కృషి చేయాలని అందరికీ సామాజిక న్యాయం జరిగేలా సంస్థ ప్రతినిధులు తమ వంతు కృషి చేయాలన్నారు. ఐహెచ్ఆర్ఎస్‌జేఓ కార్యనిర్వాహక అధ్యక్షులు రంజిత్‌కౌర్, ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ బషరత్ ఉల్లా, బీఆర్ఎస్ నాయకులు ఎండీ ఇబ్రహీం, మైనార్టీ ప్రెసిడెంట్ మౌలాలా మహ్మద్ షకీల్, మహ్మద్ ఆరిఫ్‌ఖాన్, షేక్ హనీఫ్ బాబా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహ్మద్‌ఖాన్ తదితరులు హాజరయ్యారు.

ఘనంగా నందరాజ్‌గౌడ్ వర్ధంతి

అంబర్‌పేట: దేశం కోసం షాహిద్ నందరాజ్‌గౌడ్ త్యాగం చిరస్మరణీయమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఐఎస్ఐ ఉగ్రవాదుల చేతుల్లో హత్యకు గురైన నందరాజ్ గౌడ్ 30వ వర్ధంతిని గురువారం బాగ్‌అంబర్‌పేటలోని ఆయన స్మారక స్థూపం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, స్థానిక కార్పొరేటర్ వెంకట్‌రెడ్డిలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ అమృత, నందరాజ్‌గౌడ్ కుమారుడు రోహిత్‌గౌడ్, నాయకులు కృష్ణగౌడ్, రమేష్‌యాదవ్, చుక్క జగన్, గోవర్ధన్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, ప్రవీణ్‌లతో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గరుడ పక్షి 'సేఫ్'!



చిక్కడపల్లి: పశుపక్ష్యాదుల పట్ల ప్రజలకు ఉన్న దయాగుణం ఓ ప్రాణిని కాపాడేలా చేసింది. ఈ ఘటన అశోక్‌నగర్‌లో చోటు చేసుకుంది. హిమాయత్‌నగర్ ప్రాంతంలో నివసించే శివంగుప్తా, సందీప్ పాటిల్, నితేష్ సింగ్, రాజ్‌కుమార్ తమ ఇంటి ఆవరణలోని కొబ్బరిచెట్టుపై ఉన్న మంజాలో గద్దపిల్ల చిక్కుకుని ప్రాణాపాయస్థితిలో కనిపించింది. దీంతో స్పందించిన స్థానికులు ముషీరాబాద్ ఫైర్‌స్టేషన్ అధికారులను అప్రమత్తం చేశారు. అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని గరుడ పక్షిని రక్షించి సురక్షిత ప్రాంతానికి తరలించారు.

ఢిల్లీలో ఎన్‌సీసీ కేడెట్ల ప్రతిభ



కేడెట్ల బృందంతో మహేశ్వర్

రసూల్‌పురా: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో సికింద్రాబాద్ గ్రూప్‌కు చెందిన జి. ప్రేమ్ కృతిక అత్యుత్తమ కేడెట్‌గా ఎంపికై ట్రోఫీ సాధించింది. సీనియర్ డివిజన్‌లో నావల్ వింగ్ విభాగంలో కేడెట్ అమోఘవర్ధ్‌రాజ్ నాయుడు మూడవ స్థానం, వి. శివగణేష్, సీహెచ్ నితిన్‌సాయిలు జూనియర్ డివిజన్‌లో ఆర్మీ, నేవీ విభాగంలో నాల్గవ స్థానం నిలిచి న్యూఢిల్లీ కరియప్ప పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన పీఎం ర్యాలీలో నరేంద్ర మోదీ చేతుల మీదుగా మెడల్స్ అందుకున్నారు. ఈ మేరకు ఢిల్లీ నుంచి నగరానికి చేరుకున్న సందర్భంగా ఎన్‌సీసీ డైరెక్టరేట్ కార్యాలయ ఆవరణలో కేడెట్ల ప్రతిభ ట్రోఫీలను గురువారం ప్రదర్శించారు. ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమొడోర్ పి. మహేశ్వర్ కేడెట్లను అభినందించారు.

'కాంగ్రెస్ విజయం ఖాయం'

లాలాపేట: రాహుల్ గాంధీ చేపట్టిన 4000 కిలోమీటర్ల భారత్ జోడో యాత్రలో తెలంగాణ నుంచి పాల్గొన్న కాంగ్రెస్ సేవాదళ్ వర్కింగ్ చీఫ్ ఆర్ వెంకట్రామిరెడ్డి తదితరులు గురువారం హైదరాబాద్ నగరానికి చేరుకున్నారు. విజయవంతంగా యాత్రను పూర్తి చేసుకుని వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు విమానాశ్రయం వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు అనూహ్య స్పందన లభించిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం ధీమా వ్యక్తం చేశారు. యాత్ర విజయవంతానికి సహకరించిన ప్రజలందరికి ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు.